సాక్షి
అన్నమయ్య జిల్లా

సోమవారం । 28 । జూలై । 2025



బాధ్యులెవరు? బాధితులు ఎవరు!

కడప కేంద్ర కారాగారంలో ఇటీవల సెల్‌ఫోన్లు లభించిన విషయం దుమారం రేపింది. దీనిపై రాజమహేంద్రవరం డీఐజీని విచారణ అధికారిగా నియమించారు. -8లో



అనంతపురం జట్టు విజయం

హోరా హోరీగా జరుగుతున్న ఏసీఏ అండర్-16 మల్టీ డే మ్యాచ్‌లో కర్నూలు జట్టుపై అనంతపురం జట్టు ఘన విజయం సాధించింది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.380	రూ.500
రెండోరకం	రూ.200	రూ.370

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 350 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
సీబీ	420	500
బైవోల్టిన్	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 111.100 కిలోలు



న్యూస్‌రీల్

మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండకు సోమవారం ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్టు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఉదయం 5.30 గంటలకు, 6.30 గంటలకు మదనపల్లె డిపో నుంచి బయలుదేరి మల్లయ్యకొండకు చేరుతుందన్నారు. తంబళ్లపల్లె రాగిమాను సర్కిల్ నుంచి మల్లయ్యకొండకు సాయంత్రం వరకు షటిల్ సర్వీసు నడుస్తుందన్నారు. భక్తులకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి: ప్రజల నుంచి సమస్యలను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈనెల 28వ తేదిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో కలెక్టర్ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే కార్యక్రమానికి రావాలని తెలిపారు.

ఎర్రబ్యాడ్జీలతో నిరసన



రాజంపేట డిపో గ్యారేజి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

రాజంపేట: ఎన్ఎంయూ(నేషనల్ మజ్దూర్ యూనియన్) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఆర్టీసీ కార్మికులు రాజంపేట డిపో వద్ద ఆదివారం ఎర్రబ్యాడ్జీలతో నిరసన వ్యక్తంచేశారు. డిపో గ్యారేజిలో ఎన్ఎంయూ నేతలు రమణ,ఆధ్వర్యంలో కార్మికులు ఎర్రబ్యాడ్జీలను ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గవర్నర్‌పేట డిపోను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసేందుకు చంద్రబాబునాయుడు సర్కారు చేసిన ప్రతిపాదనలు వెంటనే విరమించుకోవాలన్నారు. రాష్ట్రంలో అన్ని డిపోలను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో అప్పగించి, ఆర్టీసీ కార్మికులకు భవిష్యత్తు లేకుండా చేసేందుకు జరుగుతున్న కుట్రను తిప్పికొట్టేందుకు ఎన్ఎంయూ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. ఆర్టీసీ ప్రైవేటుపరంతో కార్మికుల మనుగడ ప్రశ్నార్థకరమని భావించాలన్నారు.కార్యక్రమంలో ఎన్ఎంయూనేతలు, కార్మికులు పాల్గొన్నారు.

బోధనేతర బరువు



- ఉపాధ్యాయులకు కొత్త కష్టాలు
- సక్రమంగా సాగని బోధన
- కుంటుపడుతున్న విద్యాప్రమాణాలు
- ఇతర పనులు అప్పగించొద్దంటూ నివేదన



ప్రతిరోజు టీచర్లు నమోదు చేయాల్సిన హ్యాండ్ బుక్

మదనపల్లె సిటీ: కూటమి ప్రభుత్వంలో ఉపాధ్యాయులకు కొత్త కష్టాలు మొదలయ్యాయి. పాఠ్యాంశ బోధనకు సిద్ధమయ్యే ఉపాధ్యాయులను బోధనేతర పనులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. విద్యార్థులకు పాఠాలు చెప్పుకోనియండి మహాప్రభో అంటూ విజ్ఞప్తి చేస్తున్నా వినిపించుకునేవారే కరువయ్యారు. కొత్తగా మండల అకడమిక్ ఫోరం టీమ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్న సమాచారం ఉపాధ్యాయులను గందగోళానికి గురి చేస్తోంది. మండల స్థాయి టీమ్‌లో ఇద్దరు ఎంఈఓలు, ఏడుగురు సబ్జెక్టు టీచర్లు, ఐదుగురు ఎస్జీటీలు ఉంటారు. వీరు నిత్యం పాఠశాలల పనితీరును పరిశీలిస్తారు. అలాగే జిల్లా, రాష్ట్ర స్థాయిలోను అకడమిక్ ఫోరమ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఇలా టీమ్‌లు, యాప్‌లతో కాలయాపన చేస్తే పిల్లలక ఎప్పుడు చెప్పాలంటూ ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు.

బోధనేతర పనులతో సతమతం

విద్యార్థులకు కిట్ల పంపిణీ, వాటి వివరాల నమోదు, మెగా పేరెంట్స్ సమావేశం, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర యాప్‌లతో ఉపాధ్యాయుల సమయాన్ని హరిస్తున్నారు. టీచర్ హ్యాండ్‌బుక్‌లో కూడా అన్ని వివరాలు నమోదు చేయాలి. ఫౌండేషన్ స్కూల్‌కు 6 టీచర్ హ్యాండ్ బుక్స్, మోడల్ ప్రైమరీ స్కూల్‌లకు 18, యూపీ స్కూళ్లకు 37, అప్‌గ్రేడ్ అయిన హైస్కూళ్లకు 33, ఉన్నత పాఠశాలలకు 51 టీచర్ హ్యాండ్‌బుక్స్‌ను ఇచ్చారు. ఏకోపాధ్యాయ పాఠశాలల ఉపాధ్యాయుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. జిల్లాలో యూపీ 201, జెడ్పీ ఉన్నత పాఠశాలలు 252, ప్రాథమిక పాఠశాలలు 1677 ఉన్నా యి. ఉపాధ్యాయులు ఐగాట్ కర్మయోగి అనే యాప్‌లో 18 కోర్సులను పూర్తి చేయా ల్సి ఉంది. దీంతో పాటు లీడర్‌షిప్ ట్రెనింగ్‌లకు హాజరు కావాల్సి ఉంది. మండల స్థాయిలో హెచ్‌ఎంలు, ఎంఈఓలు గంటల తరబడి ప్రసంగాలు వినాల్సిందే. ఈ ఏడాది కొత్తగా ఎగ్జామ్‌లో పిల్లవాడు రాసిన ఆన్సర్ షీట్లను ఫొటో తీసి లీప్‌యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో హైస్కూల్ టీచర్లు 500 నుంచి 1000 వరకు ఫొటోలను అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఇవి అప్‌లోడ్ అవుతాయో.. కావో తెలియని పరిస్థితి. ఇటువంటి ప్రతికూల పరిస్థితుల్లో విద్యాబోధన గాడితప్పుతుందని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సన్నబియ్యం బస్తా చుట్టూ తిరగాల్సిందే



ఈ ఏడాది నుంచి మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి పాఠశాలకు సన్నబియ్యం అందించారు. ప్రతి నెలా పాఠశాలకు అందిన అన్ని బస్తాలపై క్యూఆర్ కోడ్‌లను ఉపాధ్యాయులు స్కానింగ్ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. తర్వాత వంటకు ముందు ఓ బస్తా ఓపెన్ చేసి ప్రతిసారి క్యూఆర్ కోడ్‌ను స్కానింగ్ చేసి ఆ బస్తాలో ఉన్న బియ్యం క్వాలిటీ పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సిన పరిస్థితి. లేదంటే బియ్యం స్టాక్ గోడా న్ నుంచి ఉపాధ్యాయులకు ఫోన్‌లు వస్తున్నాయి.

మొరాయిస్తున్న యాప్స్

మరోవైపు మొరాయిస్తున్న యాప్‌లతో ఉపాధ్యాయులు విసిగిపోతున్నారు. పాఠశాల విద్యాశాఖలో ఉన్న అన్ని యాప్‌లను ఒక వేదికపై తీసుకొచ్చి లీప్ యాప్ రూపొందించారు. ఇందులోనే ఐఎంఎంఎస్, స్టూడెంట్ కిట్స్, మెగా పేటీఎం వంటివి అనుసంధానం చేశారు. దీంతో సర్వర్ డౌన్ సమస్యలతో ఆన్‌లైన్‌లో టీచర్ల ఫొటో హాజరు నమోదుకు పది నుంచి 15 నిమిషాల వరకు సమయం పడుతుందని ఉపాధ్యాయులు అంటున్నారు.

ప్రభుత్వం పునరాలోచించాలి



లీప్‌యాప్‌లో ఉదయాన్నే ఉపాధ్యాయుడు హాజరు వేయడం నుంచి యాప్‌ల గోల మొదలవుతోంది. తర్వాత పిల్లల హాజరును సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థిమిత్ర యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. వీటితో పాటు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహించాలి. ఇందులో తల్లిదండ్రులను భాగస్వాములు చేయాలి. మళ్లీ ఆ ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఒకటేమిటి పాఠశాలకు వెళ్లిన నుంచి ఇంటికి వచ్చే వరకు యాప్‌లో ప్రతీ అంశాన్ని అప్‌లోడ్ చేస్తున్నాం. దీంతో పాఠాలు బోధించేందుకు చాలా మంది ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం పునరాలోచన చేసి బోధనేతర కార్యక్రమాల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలి.

-రెడ్డప్పరెడ్డి, వైఎస్సార్‌టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు

బోధనేతర పనులు తగ్గించాలని పోరాటం



పాఠశాలలు తెరిచి రెండో నెల పూర్తవుతున్నా ఉపాధ్యాయులు సంతృప్తి పాఠాలు బోధించిన దాఖ లాలు లేవు. యోగాడే, మెగా పేరెంట్స్ మీటింగ్ ,శిక్షణ పేరుతో ఉపాధ్యాయులకు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. బోధనేతర పనులు తగ్గించే వరకు అన్ని యూనియన్లతో కలిసి ఉమ్మడి పోరాటానికి సిద్ధం కావాలి.

-పురం వెంకటరమణ, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి

విద్యుత్ లైన్లకు దూరంగా ఉండాలి

- ఫిర్యాదుల స్వీకరణకు వాట్సాప్ నంబర్ ఏర్పాటు
- జిల్లా విద్యుత్ శాఖ అధికారి సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎస్.రమణ



కడప కార్పొరేషన్: గాలులకు తెగిపడిన విద్యుత్ లైన్లకు ప్రజలు దూరంగా ఉండాలని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎస్. రమణ అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏవైనా సమస్యలు ఏర్పడినప్పుడు ప్రజలు స్వయంగా మరమ్మతులు నిర్వహించుకోకుండా సంబంధిత విద్యుత్ అధికారులకుగానీ, సిబ్బందికి గానీ తెలియజేసి వారి ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. తద్వారా విద్యుత్ ప్రమాదాలను అరికట్టాలని కోరారు. ప్రజల సౌకర్యార్థం వాట్సప్ ద్వారా వాలిపోయిన విద్యుత్ స్తంభాలు, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్తు లైన్లు, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యల పరిష్కారం కోసం ఒక ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని తెలిపారు. వినియోగదారులు 9440814264 నంబర్‌కు విద్యుత్ సమస్యలకు సంబంధించి ఫిర్యాదుదారుని పేరు, సమస్యకు సంబంధించిన ఫొటోలు, గ్రామం, మండలం, మొబైల్ నెంబరుతో పంపించాలన్నారు. హెల్ప్ డెస్క్ లో ఉన్న సిబ్బంది సంబంధిత అధికారులకు తెలియజేసి ఆయా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తారన్నారు.

నిత్యాన్నదానానికి లక్ష వితరణ



విరాళం అందజేస్తున్న దక్షిణామూర్తి కుటుంబ సభ్యులు

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఆదివారం రూ.1,01,116లు విరాళంగా వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. పులివెందులకు చెందిన రాధాకృష్ణ మూర్తి జ్ఞాపకార్థం కృష్ణవేణమ్మ, కుమారుడు దక్షిణామూర్తి, కోడలు లక్ష్మీప్రసన్న నగదు రూపంలో విరాళం ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ, ప్రధాన అర్చకుడు కేసరి,పాలకమండలి సభ్యులు పబ్బతి బిందుసాగర్ తదితరులు పాల్గొన్నారు.

మైలవరానికి కృష్ణా జలాలు విడుదల

కొండాపురం: గండికోట జలాశయంలో నుంచి గేటు ఎత్తి మైలవరం జలాశయానికి కృష్ణా జలాలు విడుదల చేసినట్లు జీఎన్ఎస్ఎస్ ఈఈ ఉమా మహేశ్వర్లు ఆదివారం తెలలిపారు. వైఎస్సార్ జిల్లాలో సాగు, తాగునీటి ఆవసరాల కోసం గండికోట నుంచి మైలవరానికి 1500 క్యూసెక్కులనీటిని విడుదల చేశామన్నారు. గండికోట జలాశయం పూర్తి సామర్థ్యం 26.85 టీఎంసిలు ఉండగా ప్రస్తుతం 13.9 టిఎంసీలు నీరు నిల్వ ఉందన్నారు.



గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరంకు తరలిస్తున్న కృష్ణజలాలు

గంగమ్మా..కరుణించమ్మా..



గంగమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

రాజంపేట టౌన్: పట్టణంలోని బలిజపల్లెలో వెలసి ప్రసిద్ధిగాంచిన గంగమ్మకు భక్తులు విశేష పూజలు నిర్వహించారు. శ్రావణమాసంలో వచ్చిన తొలి ఆదివారం కావడంతో అనేక మంది భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి ముద్దలు సమర్పించారు. పలువురు గంగమ్మకు ఇష్టమైన నైవేద్యాలు సమర్పించారు. వర్షాలు కురిపించమ్మా గంగమ్మా అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. వేకువ జాము నుంచే భక్తులు తరలి వచ్చారు. దీంతో బలిజపల్లె గ్రామంలో చిన్నపాటి జాతర సందడి నెలకొంది.

ది బర్నింగ్ ట్రైన్!



జయంతి ఎక్స్‌ప్రెస్ రైలును పరిశీలిస్తున్న రాజంపేట ఫైర్ సిబ్బంది



బర్నింగ్ ట్రైన్ వ్యూహాత్మక చిత్రం

- వెంటాడుతున్న 'అగ్ని'ప్రమాదాల భయం
- పొగలు, మంటలు వచ్చిన రైలు వదిలేసి ప్రయాణికుల పరుగులు

రాజంపేట: తాము ప్రయాణిస్తున్న రైలులో పొగలు.. చిన్నపాటి మంటలు వచ్చిన వెంటనే 1980లో హిందీ భాషలో విడుదలైన ది బర్నింగ్ ట్రైన్‌నే ప్రయాణికులు గుర్తుచేసుకునే పరిస్థితులు నేడుకెలిగాయి. ఇటీవల భారతీయ రైల్వేలో జరుగుతున్న అగ్నిప్రమాదాల భయం ప్రయాణికులను వెంటాడుతోంది. ఇటీవల తిరుపతి పిట్ లైన్‌లో రైలు ఫార్మిసిన్‌లోని బోగీలు కాలి బూడిదకావడంతోపాటు, తిరువళ్లూరులో ఆయిల్ ట్యాంకర్లు కాలిపోయిన సంఘటనలు ప్రయాణికుల్లో ఆందోళనకు గురిచేస్తున్నాయి.

ప్రయాణికులే అప్రమత్తం..

తమ ప్రయాణంలో అగ్నిప్రమాదాలకు దారితీసే సంఘటనలపై ప్రయాణకులు అప్రమత్తమవుతన్నారు. అధికారులకు సైతం సమాచారం ఇస్తున్నారు. ఆదివారం అన్నమయ్య జిల్లా నందలూరు-హస్తవరం రైల్వేస్టేషన్ల మధ్య కన్యాకుమారి నుంచి పుణేకు వెళుతున్న జయంతి ఎక్స్‌ప్రెస్ రైలు ప్రయాణికులు సకాలంలో స్పందించమే ఇందుకు నిదర్శనం.

రైలును వదిలేసి పరుగులు...

తాము ప్రయాణిస్తున్న రైలులో పొగలు, మంటల వ్యాపిస్తే వెంటనే చైన్ పుల్ చేసి రైలును వదిలేసి పరుగులు తీస్తున్నారు. తమ ప్రాణాలను తామే కాపాడుకునే విధంగా వ్యవహరిస్తున్నారు.జయంతి ఎక్స్‌ప్రెస్‌రైలు ప్రయాణికులు ఇదే చేశారు. ఏసీబోగీ బీ-2లో పొగ వ్యాపిస్తున్న క్రమంలో రైలును ఆపివేయించారు. అందులో నుంచి దిగేశారు. దూరంగా వెళ్లిపోయారు. పొగలను ఏసీబోగీ సిబ్బంది అగ్నిమాపక యంత్రాల ద్వారా అదుపు చేశారు.

- జయంతి ఎక్స్‌ప్రెస్ రైలులోని ఏసీబోగీ బీ-3లో కూడా పొగలు వస్తే చెయ్యేరు బ్రిడ్జి దాటగానే ప్రయాణికులే చైన్ పుల్ చేసి, నిలిపివేసిన సంఘటన రైల్వే అధికారులను కూడా విస్మయానికి గురిచేసింది.

హంసఫర్ నిలిపివేత: జయంతి రైలు ఫార్మసిన్ పొగలు వచ్చిన సంఘటనతో రైల్వే అధికారులు అప్రమత్తమై కశ్మీరు రైలు(హంసఫర్)ను నందలూరులోనే నిలిపివేశారు. ప్రయాణికులు బోగీల్లోనుంచి బయటికి రావడం, అలాగే పక్కలైనులో వేగంగా మరో రైలు వెళితే గాలికి పొగలు మరింతగా వ్యాపించే అవకాశాలు ఉంటాయి. ఆ కారణంతో హంసఫర్‌ను నిలిపివేశారు.

టీఎక్స్ఆర్ విభాగం లేకనే..

స్టీమ్ ఇంజిన్‌లోకోషెడ్ కొనసాగుతున్న నేపథ్యంలో నందలూరు రైల్వేకేంద్రంలో మూడు దశాబ్దాల కింద టీఎక్సర్ విభాగం ఉండేది. ఈ మార్గంలో నడిచే గూడ్స్ , ప్యాసింజర్ రైళ్లను టీఎక్స్ఆర్ సిబ్బంది నిశితంగా పరిశీలించేవారు. ఇప్పుడు ఆ విభాగాన్ని ఎత్తివేశారు. నందలూరు రైల్వేకేంద్రాన్ని నిర్వీర్యం చేసే క్రమంలోనే టీఎక్స్ఆర్ విభాగాన్ని ఎత్తివేశారనే ఆరోపణలు నేటికి వినిపిస్తున్నాయి. అయితే జయంతి రైలుకు బ్రేక్‌బైడింగ్ సమస్యను తిరుపతి టీఎక్స్ఆర్‌లో పనిచేసే యల్లయ్య రెస్ట్‌లో నందలూరుకు వచ్చి ఉంటే ఆయనను రైల్వే అధికారులు పిలిపించి మరమ్మతులు చేయించారు. ఆయనను కడప వరకు రైలులో ప్రయాణించేలా చేశారు. ఈ నేపథ్యంలో నందలూరు రైల్వేకేంద్రంలో టీఎక్స్ఆర్ విభాగాన్ని పునరుద్ధరించాలని ప్రయాణికులు, రైల్వే కార్మికవర్గాల వారు డిమాండ్ చేస్తున్నారు.

క్లుప్తంగా

బాలిక అదృశ్యం


శశికళ(ఫైల్)

కలసపాడు : మండలంలోని ముద్దంవారిపల్లెకు చెందిన బాలిక అదృశ్యమైంది. ఎస్‌ఐ తిమోతి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. ముద్దంవారిపల్లెకు చెందిన సగిలి సర్వేశ్వర రావు, వేళాంగిణి దంపతుల కుమార్తె సగిలి శశికళ (17) ప్రకాశం జిల్లా కొమరోలు మండలం రెడ్డిచర్ల గ్రామంలో ఉన్న అమ్మమ్మ ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి శనివారం వెళ్లింది. మూడు రోజులు అమ్మమ్మ దగ్గర ఉండి వస్తానని చెప్పిందని తల్లిదండ్రులు తెలిపారు. అయితే శశికళ అమ్మమ్మ ఇంటికి వెళ్లలేదని తెలుసుకున్న తల్లిదండ్రులు ఆమె కోసం గాలించారు. కనిపించకపోవడంతో వారు కలసపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత


సీజ్ చేసిన ఇసుక టిప్పర్

వేంపల్లె : స్థానిక కడప రోడ్‌లోని హనుమాన్ జంక్షన్ వద్ద ఇసుక టిప్పర్ పట్టుకున్నట్లు ఎస్‌ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. ఆదివారం పోలీసు సిబ్బందితో కలిసి ఆయన వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇసుక టిప్పర్ లోడుకు సంబంధించి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో సీజ్ చేశామన్నారు. అలాగే ఎలాంటి రికార్డులు లేనందున పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన వాహనం


పొలాల్లోకి దూసుకెళ్లిన జీపు

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు మండల పరిధిలోని ధర్మాపురం గ్రామం వద్ద జీపు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. తెలంగాణ ప్రాంతానికి చెందిన పర్యాటకులు గండికోటను సందర్శించడానికి ప్రొద్దుటూరు ప్రాంతం నుంచి వస్తుండగా జమ్మలమడుగు మండలం ధర్మాపురం గ్రామం సమీపానికి రాగానే బైకును తప్పించబోయి అదుపుతప్పి జీపు పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో ప్రదీప్, హేమంత్ మరో ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితులను ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది.

బాధ్యులెవరు? బాధితులు ఎవరు!

- కడప కేంద్ర కారాగారం అవినీతిమయం
- కేంద్ర కారాగార సూపరింటెండెంట్‌పై చర్యలేవీ?
- డీఐజీ ప్రాథమిక విచారణలో ఇద్దరు డిప్యూటీ సూపరింటెండెంట్‌లు, ఇద్దరు జైలర్లు, ముగ్గురు వార్డర్లు సస్పెండ్
- గతంలో రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిన డిప్యూటీ జైలర్, హెడ్ వార్డర్‌ల మాటేమిటి?
- రిమ్స్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల విచారణలో కనిపించని పురోగతి



కడప కేంద్ర కారాగారం

కడప అర్బన్ : కడప కేంద్ర కారాగారంలో ఇటీవల సెల్‌ఫోన్‌లు లభించిన విషయం తీవ్ర దుమారం రేపింది. పత్రికల్లో ప్రచురితమైన కథనాలపై స్పందించిన జైళ్ల శాఖ రాష్ట్ర డీజీ అంజనీకుమార్ రాజమహేంద్రవరం డీఐజీగా పనిచేస్తున్న ఎం.ఆర్. రవికిరణ్‌ను విచారణ అధికారిగా నియమించారు. ఆయన ఈనెల 16వ తేదీన కడప కేంద్ర కారాగారంలో విచారణ జరిపి ప్రాథమిక నివేదికను ఉన్నతాధికారులకు పంపించారు. ఈ క్రమంలో ఇద్దరు డిప్యూటీ సూపరింటెండెంట్లను ఒకరి తరువాత ఒకరిని సస్పెండ్ చేశారు. వీరిరువురిలో ఓ డిప్యూటీ సూపరింటెండెంట్ తనకు సంబంధం లేకపోయినా తనపై చర్యలు తీసుకుంటారా? అని మనోవేదనకు గురై ఏకంగా తన రాజీనామా లేఖను అధికారులకు ఈనెల 23న సమర్పించారు. అలాగే కేంద్ర కారాగారంలో వివిధ సందర్భాల్లో దొరికిన 12 సెల్‌ఫోన్‌లు, ఒక ఛార్జర్ వ్యవహారంలో కొన్నింటి గురించి మాత్రమే కడప రిమ్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసులు నమోదు చేశారు.

కడప కేంద్ర కారాగారం సూపరింటెండెంట్‌పై చర్యలేవీ?

ఇద్దరు డిప్యూటీ సూపరింటెండెంట్లు, ఇద్దరు జైలర్లు, ముగ్గురు వార్డర్లను ఒకేసారి సస్పెండ్ చేయడం జైళ్లశాఖ చరిత్రలో ఇదే మొదటిసారి అని పలువురు భావిస్తున్నారు. కానీ పాత్రధారిగా, సూత్రధారిగా వ్యవహరిస్తున్న కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ కె. రాజేశ్వరరావుపై చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులు సాహసించడం లేదని ఆ శాఖ ఉద్యోగులే ముక్కున వేలేసుకుంటున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సమీప బంధువు ఒకరు కూటమి ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నారని, ఆయన ఒత్తిడి మేరకే సూపరింటెండెంట్‌పై చర్యలకు ఉపక్రమించలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పెట్రోల్ బంకులో అవినీతితో పాటు, పాలడైరీ, ఖైదీలకు చేరవేసే రేషన్, చికెన్, మటన్‌ల సరఫరా వ్యవహారంలోనూ అవినీతికి పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. అయినా ఆయనపై ఎలాంటి చర్యలు లేవంటున్నారు. మరోవైపు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న జైళ్లశాఖ అధికారులను నెల్లూరులోని కారాగార ఉద్యోగుల శిక్షణా కేంద్రానికి పనిష్మెంట్ కింద పంపిస్తున్నారు. బాధ్యతగా పనిచేస్తున్న వారిపై సస్పెన్షన్ వేటు వేసి, బాధ్యుడైన కడప కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ రాజేశ్వరరావుపై నామమాత్రంగానైనా ఎలాంటి క్రమశిక్షణా చర్యలను తీసుకోలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

2024 మార్చి నెలలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న డిప్యూటీ జైలర్ గాజుల మహమ్మద్ రఫీ, రిమాండ్ ఖైదీగా వున్న రామనాథ్‌రెడ్డి కుటుంబ సభ్యుల ద్వారా రూ. 20వేలు ఫోన్‌పే ద్వారా తెప్పించుకున్నారు. ఎర్రచందనం కేసుల్లో రిమాండ్ ఖైదీగా వున్న జాకీర్ వద్ద నుంచి సెల్‌ఫోన్‌ను కొనేందుకు రూ. 30వేలు ఫోన్‌పే ద్వారా జీవీ చంద్రమోహన్ అనే హెడ్ వార్డర్ డబ్బులు వసూలు చేసినట్లుగా ఆరోపణలు ఎదుర్కొన్నారు. వీరిద్దరిపై వచ్చిన ఆరోపణలు ప్రాథమిక విచారణలో రుజువు కావడంతో కర్నూలు జిల్లా జైళ్లశాఖ అధికారిని విచారణాధికారిగా నియమించారు. విచారణలో సాక్షులను విచారణకు హాజరు కాకుండా చేసుకున్నారు. డిప్యూటీ జైలర్ రఫిని, హెడ్ వార్డర్ చంద్రమోహన్‌ను వారి బాస్‌గా వున్న ఓ ఉన్నతాధికారి కాపాడుతూ వచ్చారని సమాచారం. డిప్యూటీ జైలర్ గాజుల మహమ్మద్ రఫీ పెట్రోల్ బంకులో ఇన్‌చార్జిగా వ్యవహరించిన సమయంలో జరిగిన అవినీతిని కూడా బయటకు రానీయకుండా అదే ఉన్నతాధికారి 'ఆపద్బాంధవుడు'లాగా ఆదుకున్నట్లు తెలుస్తోంది. కడప కేంద్ర కారాగారంలో అవినీతిని అరికట్టేందుకు, ఖైదీల్లో సత్ప్రవర్తన కలిగించేందుకు జైళ్ల శాఖ ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని, కడప కేంద్ర కారాగార వ్యవస్థను ప్రక్షాళన చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కాగా, కడప కేంద్ర కారాగారంలో తనిఖీలలో లభ్యమైన సెల్‌ఫోన్‌లు, చార్జర్ వ్యవహారంలో కడప రిమ్స్ పోలీసు స్టేషన్‌లో కేవలం మూడు కేసులే నమోదయ్యాయని తెలుస్తోంది. ఈ కేసుల్లో బాధ్యులైన వారిపై పోలీసుల చర్యలు ఏమిటన్నది తెలియడం లేదు. మిగతా కేసుల నమోదు విషయంలో, విచారణ వ్యవహారంలో పోలీసులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె రూరల్ : వేర్వేరు ఘటనల్లో ఆదివారం ముగ్గురు ఆత్మహత్యా యత్నానికి పాల్పడి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మండలంలోని పెంచుపాడుకు చెందిన బాలాజీనాయక్ భార్య శాంతమ్మ (39) కుటుంబ సమస్యలతో పురుగుల మందు తాగింది. అదే విధంగా నీరుగట్టువారిపల్లెకు చెందిన రమణ కుమారుడు అశోక్, తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెకు చెందిన క్రిష్ణప్ప కుమారుడు నాగార్జున(20) కుటుంబ సమస్యలతో విష ద్రావణం తాగారు. ఆయా సంఘటనల్లో గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రంలోని 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు మెమో నంబర్ 57 ద్వారా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాజుయాదవ్ కోరారు. ఆదివారం కడప పర్యటనకు వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్‌ను వారు కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కూడా యూపీఎస్ స్థానంలో ఓపీఎస్ అమలు చేయాలని కోరారు.

లోకేష్ మెప్పు కోసమే సతీష్‌రెడ్డిపై ఆరోపణలు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి మనస్తత్వం పులివెందుల ప్రాంత ప్రజలకు తెలియంది కాదని, లోకేష్ మెప్పు కోసమే సతీష్‌రెడ్డిపై పులివెందుల టీడీపీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, వైఎస్సార్ సీపీ నాయకులు అంబకపల్లె బాబురెడ్డి, నాగేళ్ల సాంబశివారెడ్డి, రసూల్, బయపురెడ్డి, రవీంద్రారెడ్డి, హాలు గంగాధరరెడ్డి, పార్నపల్లె కిశోర్, సర్వోత్తమ రెడ్డి, నూరుల్లా, విశ్వనాథరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాము తదితరులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు.

టీడీపీ నాయకులు ఒకసారి వైఎస్సార్‌సీపీ విడుదల చేసిన బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కరపత్రంలో క్యూఆర్ కోడ్‌ను తెరిచి చూస్తే మీ నాయకులు ఇచ్చిన హామీలు చూసి మీరే సిగ్గుపడాల్సి వస్తుందన్నారు. ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం సిగ్గు చేటన్నారు. పులివెందులలో మైనర్ విద్యార్థులపై అక్రమంగా హత్యాయత్నం కేసు పెట్టించిన ఘనత టీడీపీ నాయకులది అన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగంతో పాటు అక్రమ రేషన్ రవాణా, పేకాట, గంజాయి, మహిళలపై అత్యాచారాలు, భూకబ్జాలు వంటి వాటితో శాంతిభద్రతలను నాశనం చేసి భ్రష్టు పట్టించారని విమర్శించారు. గండికోటలో బాలిక హత్య కేసులో నిందితులను పట్టుకోవడానికి ఈ ప్రభుత్వానికి ఎందుకు అంత నిర్లక్ష్యమని ప్రశ్నించారు. వీటన్నిటిపై ఎమ్మెల్సీ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. 2014లో తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వైఎస్ జగన్ పంచన చేరాలని ప్రయత్నించిన మాట వాస్తవం కాదా అని రాంగోపాల్‌రెడ్డిని ప్రశ్నించారు. సతీష్‌రెడ్డి నిక్కచ్చి మనిషి కనుకే పార్టీ మారాలనుకున్నారని, అంతేకానీ మీలాగా అందితే జుట్టు, అందకపోతే కాళ్లు పట్టుకునే వైఖరి కాదన్నారు. పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి రాంగోపాల్‌రెడ్డిని ఓడించాలని తమ పార్టీ నేత సజ్జల రామకృష్ణారెడ్డితో బీటెక్ రవి సంప్రదింపులు జరిపిన మాట వాస్తవం కాదా అన్నారు. పులివెందులలో కోట్లు ఖర్చు పెట్టి నిర్మించిన మెడికల్ కళాశాలకు వచ్చిన 50 సీట్లను టీడీపీ ప్రభుత్వం వెనక్కి పంపితే ఈ విషయంపై చంద్రబాబు, లోకేష్‌ను మీరు ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. సుప్రీంకోర్టు పరిధిలో ఉన్న బెరైటీస్‌ను రాత్రికి రాత్రే అడ్డగోలుగా అక్రమంగా తరలించి వాటాలు పంచుకోలేదా అన్నారు. అక్రమ మైనింగ్ గురించి మీ పార్టీ వారే ఒకరిపై ఒకరు ఫిర్యాదులు, ఆరోపణలు చేసుకుంటూ ఇప్పుడు వైఎస్సార్‌సీపీ నాయకుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. పులివెందుల ప్రాంత రైతులు సాగునీరు లేక ఇబ్బందులు పడుతుంటే, వారి గోడు ఏమాత్రం అయినా పట్టించుకున్నారా అని పేర్కొన్నారు. తాను ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తానని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ముందుకు వస్తే ఆ ట్రాన్స్‌ఫార్మర్లను బిగించవద్దని అధికారులను మీరు బెదిరించడాన్ని బట్టే ఈ ప్రాంత రైతుల పట్ల మీకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉందో తెలుస్తుందన్నారు.

ఆశా వర్కర్స్ మహాసభలు జయప్రదం చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కడపలో ఆగస్టు 30, 31 తేదీలలో జరిగే ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మూడవ మహాసభలను జయప్రదం చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎస్.వెంకటసుబ్బయ్య అన్నారు. ఆదివారం నగరంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 17 ఏళ్లుగా గర్భవతులు, బాలింతలు, నవజాత శిశువులకు సేవలందిస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలను క్షేత్ర స్థాయిలో ప్రజల వద్దకు చేర్చటంలో కీలకపాత్ర పోషిస్తున్న ఆశా కార్యకర్తలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని అన్నారు. ఉద్యోగానికి భద్రత లేక కనీస వేతనం లేక గుర్తింపు లేక సంవత్సరానికి 365 రోజులూ సెలవులు లేకుండానే పని చేస్తున్నారన్నారు. ప్రభుత్వాలు ఆశాలతో వెట్టి చాకిరీ చేయించుకోవడం తప్ప వేతనాలు పెంచాలని, ఉద్యోగానికి భద్రత కల్పించాలని ఆలోచన చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఆశా కార్యకర్తల సమస్యల పైన మహాసభలలో చర్చించి, తీర్మానాలు చేసి ఉద్యమ కార్యాచరణ రూపొందించుకోబోతున్నట్లు తెలిపారు. కడపలో జరుగుతున్నటువంటి ఆశ యూనియన్ మూడవ రాష్ట్ర మహాసభలకు రాష్ట్రంలో ఉన్న ప్రతి జిల్లాలోని ఆశా కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి, 30వ తేదీ ప్రదర్శన బహిరంగ సభ, 31వ తేదీన ప్రతినిధుల సభను జయప్రదం చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.సుభాషిణి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటి వేణుగోపాల్, ఎల్.నాగసుబ్బారెడ్డి, జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి కేసీ బాదుల్లా, జిల్లా నాయకులు బి.చంద్రశేఖర్, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ తిరుపతి జిల్లా కార్యదర్శి చాముండేశ్వరి, కోశాధికారి వాణి, అధ్యక్షురాలు హేమ, జిల్లా అధ్యక్షురాలు యు.మరియమ్మ, కోశాధికారి అమ్ములు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ బి. శాంతమ్మ, కర్నూలు జిల్లా కార్యదర్శి రమ్మీ జాబి, నంద్యాల జిల్లా కార్యదర్శి వేదవతి, వరలక్ష్మి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస రాజు

రాయచోటి టౌన్ : ఇటీవల బదిలీలు, పదోన్నతులపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఆయా పొజిషన్ ఐడీ వెంటనే కేటాయించడంతో పాటు జీతాలు చెల్లించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాస రాజు డిమాండ్ చేశారు. ఆదివారం రాయచోటి డైట్ కళాశాల ఆవరణంలో ఎన్‌టీఏ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ ఆధారిత హాజరు నమోదుకు గతంలో ఇచ్చిన హామీ మేరకు ఉదయం తొమ్మిది గంటల పది నిమిషాల వరకు గ్రేస్ పీరియడ్‌గా ప్రకటించాలని కోరారు. మూడు నెలలు పూర్తి అయినా 10వ తరగతి స్పాట్ వాల్యుయేషన్ విధులు నిర్వహించిన వారికి పైకం చెల్లించకపోవడం దారుణమన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల స్థానంలో డీఎస్సీ ఉపాధ్యాయులు వచ్చే వరకు విద్యా వలంటీర్లను నియమించి విద్యార్థులకు బోధన కుంటుపడకుండా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎన్‌టీఏ నాయకులు మధుసూదన్ రెడ్డి, ఫక్కీర, నరసింహారెడ్డి, బచ్చల శ్రీనివాసులు, వేణుగోపాల్ రావు, కులశేఖర్ రెడ్డి, గోవింద్ నాగరాజు, రాజబాబు, ఆసీఫ్, వెంకట్రామరాజు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయాలని, ఇందుకు పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేయాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. ఆదివారం కడపలోని ఆదిత్య కల్యాణ మండపంలో బీజేపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తిరుమల తొలి గడప కడప నుంచి రాష్ట్ర పర్యటన ప్రారంభిస్తున్నామన్నారు. వేలాది కీర్తనలు రాసిన తాళ్లపాక అన్నమాచార్యులు, ప్రజా కవి యోగి వేమన, తెలుగును ప్రపంచానికి తెలిసేలా కృషి చేసిన సీపీ బ్రౌన్ వంటి మహనీయులు నడయాడిన గడ్డ కడప అన్నారు. కడప సాహిత్య, చారిత్రక నేపథ్యమే కాక రాజకీయంగా కూడా ప్రాధాన్యత ఉన్న ప్రాంతమన్నారు. రాయలసీమ అభివృద్ధికి బీజేపీ అధిష్టానం అనేక కార్యక్రమాలు చేపట్టనుందన్నారు.

బీజేపీ సహకారంతోనే కూటమి స్థిరత్వం: ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ అన్నివిధాలుగా సహకరించకపోతే కూటమి ప్రభుత్వం స్థిరంగా ఉండే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో బీజేపీకి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకట సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరు మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని, కడపలో డిప్యూటీ మేయర్ పదవి బీజేపీకి కేటాయించాలన్నారు. అంతకుముందు వాయుపుత్ర కేఫ్‌లో చాయ్ పే చర్చా కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ యాదవ్, యల్లారెడ్డి, పుష్పాల శ్రీనాథరెడ్డి, శారదమ్మ, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ వంగల శశిభూషణ్‌రెడ్డి, బీజేవైఎం నాయకులు బొమ్మన విజయ్, నాయకులు సింగారెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహనంతోపాటు ఎర్రచందనం స్వాధీనం


అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్న వాహనం, ఎర్రచందనం దుంగలు

పీలేరు : వాహనంతోపాటు ఎర్రచందనం స్వాధీనం చేసుకున్నట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జయప్రసాద్‌రావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు స్థానిక కడప మార్గంలో బోడుమల్లువారిపల్లె బ్రిడ్జి అటవీ సిబ్బంది ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వాహనాలు పరిశీలిస్తుండగా అనుమానాస్పదంగా వేగంగా వచ్చిన వాహనాన్ని సిబ్బంది ఆపే ప్రయత్నం చేశారు. అయితే వాహనాన్ని వేగంగా ముందుకు తీసుకెళ్లి రోడ్డు పక్కన ఆపి దుండగులు చీకట్లో పారిపోయారు. వాహనాన్ని పరిశీలించగా 167 కేజీల బరువు గల నాలుగు ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించారు. ఈ దాడిలో సిబ్బంది సబిహా సుల్తానా, శ్రీనివాసన్, నాగేంద్ర పాల్గొన్నారు.

బాల సాహిత్యంలో మేటి ఆర్.సి.కృష్ణస్వామి రాజు

కడప ఎడ్యుకేషన్ : విజ్ఞానం, యుక్తిని మేళవించి బాలసాహిత్యాన్ని రచించిన మేటి రచయిత ఆర్.సి.కృష్ణస్వామి రాజు అని తిరుపతికి చెందిన విశ్రాంత తెలుగు పండితులు డాక్టర్ నెమిలేటి కిట్టన్న అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న «నెలనెలా సీమ సాహిత్యం» కార్యక్రమంలో భాగంగా ఆదివారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో 145వ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ ఆర్.సి.కృష్ణస్వామి రాజు రచనలు చిత్తూరు జిల్లా మాండలికం, జనం మాట్లాడుకొనే భాషలో ఉంటాయని, అదే విధంగా అక్కడి ప్రాంతాలే ఆయన కథా కేంద్రాలుగా ఉంటాయన్నారు. ఆ తర్వాత «ఆర్.సి.కృష్ణస్వామి రాజు బాలసాహిత్యం» అనే అంశంపై విశ్రాంత తెలుగు పండితులు నెమిలేటి కిట్టన్న ప్రసంగించారు. ఆయన తన ప్రసంగంలో రాయలసీమ కథాసాహిత్యానికి వన్నె తెచ్చిన కథకుల్లో ఆర్.సి.కృష్ణస్వామి రాజు ఒకరని, బాలసాహిత్యకర్తగా కూడా ఆయన గురుతరమైన బాధ్యతను నిర్వర్తిస్తున్నారన్నారు. ఇప్పటి వరకు ఆయనవి చిన్నాపెద్దా కథలు 650 దాకా వివిధ పత్రికల్లో ప్రచురింపబడ్డాయని, వీటిలో 150 పిల్లల కథలు ఉండటం విశేషమన్నారు. ఆర్.సి. కృష్ణస్వామి రాజు తిరుపతి జిల్లా పుత్తూరు శల్య వైద్య కుటుంబానికి చెందిన వారన్నారు. ఆయన మొదట కార్వేటి నగరం డైట్‌లో అధ్యాపక ట్రెనింగ్ పూర్తి చేశారని, ఆ తర్వాత తిరుపతి ఎల్‌ఐసీ కార్యాలయంలో 35 ఏళ్ల పాటు డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పని చేసి పదవీ విరమణ పొందారన్నారు. ఆయన ఇప్పటి దాకా భిన్న వర్గాలకు చెందిన 18 కథా సంపుటాలు, 2 నవలలను వెలువరించారన్నారు. బాల సాహిత్య సృష్టిలో భాగంగా ఆయన రాజు గారి కథలు, రాణి గారి కథలు, కార్వేటినగరం కథలు, నాన్నారం కథలు అనే కథా సంపుటాలను, మేకల బండ, మునికిష్టడి మాణిక్యం అనే నవలలను రాశారన్నారు. మానవీయ సంబంధాలు, విలువలు కృష్ణస్వామి రాజు బాలసాహిత్యంలో ఎలా చిత్రింపబడినది విశ్లేషణాత్మకంగా తెలియజేశారు.

మెరిసిన కడప కుర్రోడు

కేంబ్రిడ్జి యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ ప్రదానం


తల్లిదండ్రులతో కందకూరి తరుణ్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్/పులివెందుల టౌన్ : వైపులివెందులకు చెందిన కందకూరి తరుణ్ రెడ్డి ప్రపంచ ప్రఖ్యాత కేంబ్రిడ్జి యూనివర్సిటీ పెయింట్ ఎడ్మండ్ కళాశాల లండన్ నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. బయోమెడికల్ ఎలక్ట్రానిక్ విభాగంలో వైద్య రంగంలో పాయింట్ ఆఫ్ కేర్ టెక్నాలజీల కోసం ఎనర్జీ హార్వెస్టర్ల అభివృద్ధిలో కృత్రిమ మేధస్సును ఉపయోగించడం అనే అంశంపై చేసిన పరిశోధనకు ఈనెల 26వ తేదీన కేంబ్రిడ్జి యూనివర్సిటీ సెనెట్ హాల్‌లో డాక్టరేట్ డిగ్రీ పీహెచ్‌డీ అందుకున్నారు. తల్లిదండ్రులు కందకూరి రామమోహన్‌రెడ్డి, కందకూరి లలితాదేవి, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

పిచ్చికుక్క దాడిలో చిన్నారికి గాయాలు


పిచ్చికుక్క దాడిలో గాయపడిన సుశాంత్

బద్వేలు అర్బన్ : పట్టణంలోని సుమిత్రానగర్‌లో ఆదివారం పిచ్చికుక్క దాడిలో ఓ బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. సుమిత్రా నగర్ సమీపంలోని ప్రదీప్ స్కూల్ వద్ద నివసిస్తున్న పవన్, శరణ్యల కుమారుడైన సుశాంత్ అనే మూడేళ్ల బాలుడు ఇంటి ముందు ఆడుకుంటుండగా పిచ్చికుక్క ఒక్కసారిగా మీద పడి దాడి చేసింది. దీంతో చేతి భాగంలో తీవ్ర గాయం కావడంతో తల్లిదండ్రులు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించారు. ఇటీవల కాలంలో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని మున్సిపల్ సిబ్బందికి తెలిపినప్పటికీ పట్టించుకోలేదని ఆ వార్డు ప్రజలు వాపోయారు.

అనంతపురం జట్టు విజయం


6 వికెట్లు తీసిన అనంతపురం బౌలర్ కిరణ్ కుమార్


167 పరుగులు చేసిన చిత్తూరు బ్యాట్స్‌మెన్ హర్ష


83 పరుగులు చేసిన చిత్తూరు బ్యాట్స్‌మెన్ మహ్మద్ షారుఖ్ అక్తర్


102 పరుగులు చేసిన చిత్తూరు బ్యాట్స్‌మెన్ తనీశ్వర్ టెండూల్కర్

డ్రాగా ముగిసిన చిత్తూరు–నెల్లూరు మ్యాచ్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : హోరా హోరీగా జరుగుతున్న ఏసీఏ అండర్–16 మల్టీ డే మ్యాచ్‌లో అనంతపురం జట్టు విజయ సాధించింది. మూడవ రోజు ఆదివారం కేఓఆర్‌యం క్రికెట్ మైదానంలో అనంతపురం–కర్నూలు జట్ల మధ్య మ్యాచ్‌లో 221 పరుగులతో అనంతపురం జట్టు విజయం సాధించింది. 257 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో మ్యాచ్‌ను ప్రారంభించిన అనంతపురం జట్టు 70.4 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 295 పరుగులకు డిక్లేర్ చేసింది. ఆ జట్టులోని దేవాన్ష్ 41 పరుగులు, సంజయ్ 31 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని హితేష్ వర్ధన్ 3 వికెట్లు, వివేక్ 3 వికెట్లు, సాయి విఘ్నేష్ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 49.1 ఓవర్లలో 159 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని రుత్విక్ కళ్యాణ్ 39 పరుగులు, రోహిత్ గౌడ్ 28 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని కిరణ్‌కుమార్ అద్భుతంగా బౌలింగ్ చేసి 6 వికెట్లు తీశాడు. సంజయ్ 2 వికెట్లు తీశారు.

వైఎస్‌ఆర్‌ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో..

వైఎస్‌ఆర్‌ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న మరో మ్యాచ్‌లో చిత్తూరు–నెల్లూరు జట్ల మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఆదివారం మూడవ రోజు రెండవ ఇన్నింగ్స్‌లో 40 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో మ్యాచ్‌ను ప్రారంభించిన చిత్తూరు జట్టు 99 ఓవర్లకు 6 వికెట్లు కోల్పోయి 414 పరుగులు చేసింది. ఆ జట్టులోని హర్ష 167 పరుగులు, తనీశ్వర్ టెండూల్కర్ 102 పరుగులు, మహ్మద్ షారుఖ్ అక్తర్ 83 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని సుశాంత్ 2 వికెట్లు, రిత్విక్ 2 వికెట్లు తీశారు.

100 అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం


అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఎన్వీ రమణ

లింగాల : లింగాల మండలం వెలిదండ్ల గ్రామంలో అక్రమ బెల్టు షాపులపై ఆదివారం లింగాల పోలీసులు దాడి నిర్వహించారు. ఈ దాడుల్లో కేశం రెడ్డి చెన్నకేశవరెడ్డి అనే వ్యక్తి ఇంట్లో పోలీసులు సోదా చేయగా ఆయన ఇంటిలో 100 చీప్ లిక్కర్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశామని రూరల్ సీఐ ఎన్వీ రమణ తెలిపారు. ఆదివారం మండల లింగాల పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహించినా, అక్రమంగా అమ్మకాలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో హెడ్ కానిస్టేబుల్ రాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.